క్లుప్తంగా

శివపార్వతులకు పల్లకీ సేవ



శివపార్వతులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏక శిలారూపంలో కొలువైన శివపార్వతులకు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్ద పీట



పనులను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్, ఎంపీపీ

బేతంచెర్ల: విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్ అన్నారు. సోమవారం పట్టణ సమీపంలో కొలుములపల్లె రహదారిలో రూ.30 లక్షల నిధులతో చేపట్టిన ఉర్దూ పాఠశాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఖాజీ నూర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరి, వలీ బాషా, ఖాజా, నజీర్, సలీమ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న బలిజ సంఘం పెద్దలు

అవుకు: మండల కేంద్రంలోని అగ్రహారం వీధికి చెందిన గుడిపాటి వెంకట లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. బలిజ సంఘం పెద్దలు మృతురాలి స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు కునుకుంట్ల రామన్న, దంతెల రమణ, జక్కా మధు, బసెట్టి శ్రీరాములు, ప్రసాద్, గాజుల కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

డోన్ టౌన్: గర్భిణికి ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సమాచారం తెలుసుకున్న ద్రోణాచలం సేవా సమితి సభ్యుడు మధు సోమవారం రక్త దానం చేశాడు. బేతంచెర్లకు చెందిన గర్భిణి కవిత చికిత్స కోసం పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి రాగా వైద్యులు పరీక్షించి రక్తం తక్కువ ఉందని చెప్పడంతో బంధువులు ద్రోణాచలం సేవా సమితిని ఆశ్రయించారు. మధు స్పందించి రక్తం దానం చేయడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు బీరువా వితరణ



బీరువాను ప్రారంభిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన బండారు సుధాకర్ యాదవ్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.10 వేల విలువ చేసే బీరువాను విరాళమిచ్చారు. సోమవారం బీరువాను వైఎస్సార్‌సీపీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్ట్ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం బెలుంలో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి గ్రామస్తులకు ఉచితంగా మినరల్ వాటర్ సౌకర్యం అందిస్తామన్నారు. ఇటీవల రజకుల కోసం బోరు వేయించామని, అక్కడే దోబీ ఘాట్ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు చెప్పారు. శ్మశాన వాటికలో కంపచెట్లు తొలగించి, మట్టి వేయించి చదును చేయిస్తామన్నారు.

పరీక్షలు చేయించుకో... భూసారం పెంచుకో!

- మట్టి పరీక్షల ఫలితాలనుగుణంగా పంటల సాగు
- ఎరువుల వాడకంతో దిగుబడులు అధికం
- రైతులను చైతన్యపరుస్తున్న వ్యవసాయాధికారులు

బనగానపల్లె: అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రైతు భరోసా పథకం ద్వారా వ్యవసాయానికి ఆర్థిక సాయం, సబ్సిడీ విత్తనాలు, మందులు ఇవ్వడంతో పాటు వ్యవసాయాధికారులతో మెలకువలను ఇప్పిస్తోంది. పొలంలోని మట్టిని సేకరించి ఫలితాలను బట్టి ఏ పంట, ఎంత మోతాదుల ఎరువు వేసుకోవాలో రైతులుకు తెలియజే స్తో ంది. అధిక దిగుబడులు సాధించేదుకు అధికారుల సూచనలు, సలహాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

మట్టి నమూనాల సేకరణ

మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడి అధిక దిగబడులు సాధించుకోవాలని వ్యవసాయాధికారులు అన్నదాతకు సూచిస్తున్నారు. అంతేకాకుండా పొలం బడి కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులను చైతన్య పరుస్తున్నారు. మండల వ్యవసాయాధికారితోపాటు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది నేరుగా పొలాల వద్దకు వెళ్లి మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. ప్రయోగశాలలో భౌతిక రసాయానిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి ని గుర్తించి రైతులకు తెలియజేస్తున్నారు. నియోజకవర్గంలో వ్యసాయాధికారుల లెక్కల ప్రకారం 2.16 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా దాదా పు 50 శాతం భూములకు సంబంధించి మట్టి నమూనాలు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

భూసార పరీక్షల ప్రయోజనాలు

భూసార పరీక్షలతో రైతులకు ఎన్నోప్రయోజనాలు ఉన్నాయి. ఈ పరీక్షలతో భూసారం తెలుస్తుంది. సంబంధిత భూముల్లో ఏ పంట అనుకూలమో తెలుస్తుంది. ఎరువులు ఎంత మోతాదులో వాడాలనే విషయం తెలుస్తుంది. మట్టిపరీక్షలు భూమికి పంటకు శ్రీరామరక్షగా నిలుస్తుంది.

సూక్ష్మపోషకాలే కీలకం

అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయన ఎరువుల మూలంగా భూమిలోని పోషకాలు నసించిపోతున్నాయి. పొటషియం ఎక్కువగా వాడడంతో మెగ్నీషయం, జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషకాలు మొక్కలకు అందకుండా పోతున్నాయి. ఫలితంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మపోషకాలతో పాటు నైట్రోజన్, సేంద్రియ కర్బనాణాల స్థాయి ఎంతో కీలకం. కర్బణంలోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎరువు ఎంత వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బణం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.



వ్యవసాయ పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

మట్టి సేకరణలో జాగ్రత్తలు

పొలంలో ఎరువులు వేసిన తరువాత నెల రోజుల పాటు మట్టి సేకరించకూడదు. అదే విధంగా పంటకు నీరుపెట్టిన తరువాత, నీడపడేప్రదేశాలు, ఎరువులు కుప్పలుగా ఉన్న చోట, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు. పంట కోత అనంతరం వేసవిలో మళ్లీ పంట వేయకముందు మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించాలి. పొలంలో వి ఆకారంలో 15–20 సెం మీల లోతున పారతో గుంత తీసి అందులో పై పార నుంచి కింది వరకు ఒకపక్కగా మట్టిని సేకరించాలి. పొలంలో మొత్తంగా 8–10 చోట్ల సేకరించాల్సి ఉంటుంది.

భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు



భూసార పరీక్షలు చేయించుకుంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయవచ్చు. అవసరమైన ఎరువులు వాడి అధిక దిగుబడులు సాధించవచ్చు. భూసార పరీక్షలు చేసి రైతులకు కార్డులు అందించే కార్యక్రమం ప్రారంభించాం. ఈ ఏడాది కూడా రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె మండలం

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు పక్కన గుంతలను పూడ్చివేయిస్తున్న రంగస్వామి

డోన్ టౌన్: వాహనదారుల ఇబ్బందులు తొలగించి వైఎస్సార్‌సీపీ నాయకుడు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని సీసంగుతల గ్రామం నుంచి యు.కొత్తపల్లె వెళ్లే బీటీ రోడ్డుపై పలు చోట్ల గుంతలు పడ్డాయి. వాహనదారుల ఇబ్బందులను గమనించిన సీసంగుంతల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గాజు రంగస్వామి తన సొంత ఖర్చులతో ట్రాక్టరు ద్వారా మట్టి వేయించి గుంతలు పూడ్చి వేయించారు. దీంతో ఆయనకు గ్రామస్తులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 6న పట్టణంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాల మైదానంలో జూనియర్ షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని షూటింగ్ బాల్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్న 19 ఏళ్లలోపు బాలబాలికలు ఫొటో, ఆధార్ కార్డుతో పాటు రూ.20 ప్రవేశ రుసుము చెల్లించి పోటీలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ : 9959051059 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి జియారత్ సోమవారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభయ్యాయి. మధ్యాహ్నం కందూరు నిర్వహించారు. జార్తలను పురస్కరించుకుని స్వామివార్లకు భక్తులు దట్టీలు, వెండిగొడుగులు, పూల దండలను ఊరేగింపుగా తీసుకొచ్చి అలంకరించారు. ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నుంచే గాక వైఎస్ఆర్‌జిల్లాలోని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అనంతపురం జిల్లా తాడిపత్రి, అనంతపురం, హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి పీర్ల ఊరేగింపు ప్రారంభం కాగా మంగళవారం సాయంత్రంతో జిహారత్ ముగియనుంది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐలు వెంకటరెడ్డి, మౌలానీ తమ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.



ప్రత్యేక ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో మౌలాలీ స్వామి జార్తాల సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తులు మంగళవాయిద్యాల మధ్య స్వామి వారికి పూల దండలు, వెండి గొడుగులు, ఆకులు సమర్పించారు. మౌలాలి స్వామిని అర్ధ రాత్రి గ్రామంలోని నలు దిక్కులున్న హద్దుల వరకు ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు బైటిపేట ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

స్పందన ఫిర్యాదులపై దృష్టి సారించండి

డోన్ టౌన్: స్పందన కార్యక్రమంలో ప్రజలు చేస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం స్పందన అర్జీలు, ఆర్ఓఆర్ కోర్టు కేసులను విచారించారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు సిఫార్స్ చేయగా 8 ఆర్ఓఆర్ కేసులను విచారించి రెండింటికి పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేయగా మిగిలిన ఆరు కేసులను వాయిదా వేశారు.



అర్జీదారులను విచారిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

న్యాయవాదులు విధుల బహిష్కరణ



కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

బనగానపల్లె రూరల్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. సందర్భంగా బార్‌అసోసియేషన్ అధ్యక్షులు టీఆర్ జగన్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో న్యాయవాదిని హత్య చేయడం దారుణమన్నారు. న్యాయవాదిని హత్య చేసిన వారిని కఠిన శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ నరసింహారెడ్డి, సీనియర్ న్యాయవాదులు పరశురామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మండ్ల రఘురామిరెడ్డి, రాజకుల్లాయి, బాబావలి, ఎస్ నాగేంద్రరెడ్డి, ముజాహీద్, విక్రం, షేక్షావలి పాల్గొన్నారు.

తలనీలాల వేలం పాటలు వాయిదా

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు, దేవదాయశాఖ తనిఖీ అధికారి శ్రీనివాసులు రెడ్డి సమక్షంలో సోమవారం నిర్వహించిన తలనీలాల సేకరణ వేలం పాటలు వాయిదా పడ్డాయి. బహిరంగ వేలం పాటలో డిపాజిట్‌దారులు ఎవరూ రాకపోవడంతో దుకాణాల వేలం ఆగస్టు 4, తలనీలాల సేకర వేలం 18కి వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం ఆవరణలో సీడీ, పటాలు విక్రయించుకునేందుకు డోన్‌కు చెందిన రామారావు రూ.8 లక్షలకు దక్కించకున్నారు. పండ్లు, పల్లీల వేలం పాటను డోన్ బలరామకృష్ణ దక్కించుకున్నార న్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు పాల్గొన్నారు.



వేలం పాటలు నిర్వహిస్తున్న ఆలయ ఈఓ, చైర్మన్

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వీఆర్ఏలు

బనగానపల్లె రూరల్: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ సోమవారం వీఆర్ఏల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగేష్, మండల అధ్యక్షులు బాలన్న ఆధ్వర్యంలో పలువురు వీఆర్ఏలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నాగేష్ మాట్లాడుతూ వీఆర్ఏలకు మూడు సెంట్ల స్థలం, అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు మధు, రవి, మద్దిలేటి, సుబ్బలచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసనలు

డోన్ టౌన్: విద్యుత్ శాఖలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు సోమవారం కొనసాగాయి. నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం, పోలీసు స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈఈ రమణారావు, ఏఈలు నాగేశ్వరరెడ్డి, రమాదేవి, మద్దిలేటి, రాఘవేంద్ర ప్రసాద్, వినయ్‌కుమార్, జేఏసీ అధ్యక్షులు భాస్కర్‌రావు, కన్వీనర్ రామాంజనేయులు, కార్యదర్శి రామకృష్ణ, నాయకులు రవి, వెంకటేశ్వర్లు, రమేష్, కేశవరాముడు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రగతి మెరిసే!

- రూ.84 లక్షలతో కొత్త భవనాలు
- నూతన భవనాలు ప్రారంభానికి ముస్తాబు





గ్రామ సచివాలయం , రైతు భరోసా కేంద్రం



హెల్త్ క్లినిక్

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోంది. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించడంతో ప్రగతి మెరుస్తోంది. కోవెలకుంట్ల మేజర్ గ్రామపంచాయతీలో రూ.84 లక్షలతో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు ఏర్పాటుచేయడంతో కొత్త శోభ సంతరించుకుంది. పట్టణంలోని ఐదవ గ్రామ సచివాలయానికి రూ.45 లక్షలతో కొత్త భవనం, రూ.21.50 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్‌హెల్త్ క్లినిక్‌లకు భవనాలు నిర్మించారు. త్వరలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కొత్తభవనాలను ప్రారంభిస్తారని ఎంపీడీఓ రాధిక తెలిపారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

డోన్‌టౌన్: మణిపూర్ ఘటన దుండగులపై చర్యలు తీసుకోవాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉస్మాన్ ఘని డిమాండ్ చేశారు. మణిపూర్ అల్లర్లకు నిరసనగా సోమవారం స్థానిక కార్యాలయం నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు నెలలు గా సాగుతున్న రెండు తెగల మధ్య ఘర్షణలను నివారించకుండా కేంద్రం చోద్యం చూడటం తగదన్నారు.

ఈరోజు

నేడు అభివృద్ధి పనుల పరిశీలన

డోన్: మండలంలోని ఎర్రగుంట్ల గ్రామం వద్ద నిర్మించిన నగరవనంతో పాటు డోన్‌లో అత్యాధునిక వసతులతో రూ.40 కోట్ల వ్యయం చేసి నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణ పనులను మంగళవారం ప్యాపిలి మండల ప్రజాప్రతినిధులు, వైఎఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించనున్నారని ఆ పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది

గడప గడపకు మన ప్రభుత్వం

మండలంలోని ధర్మవరం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉటందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పౌర్ణమి పూజలు

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల అనంతరం సాయంత్రం స్వామికి పల్లకీ సేవ ఉంటుందని, భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకోవాలని సూచించారు.

నియోజకవర్గ స్థాయి సమావేశం

సంజామల: బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగే నియోజకవర్గ స్థాయి సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని తహసీల్దార్ మల్లికార్జున రావు కోరారు. సమావేశంలో ఓటరు జాబితా సవరణపై చర్చ ఉంటుందన్నారు.

పింఛన్ల పంపిణీ

బనగానపల్లె: మండలంలో మంగళవార వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య సోమవారం తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

డోన్: మండలంలోని వెంకటాపురం – తుమ్మలచెరువును టూరిజం స్పాట్ కింద అభివృద్ధి చేసేందుకు మొదటి దశ కింద పట్టణం నుంచి 4 కిలోమీటర్ల నాలుగులైన్ల రహదారి నిర్మిస్తున్నారు. ఉలిగమ్మ గుడి వద్ద నుంచి వెంకటాపురం చెరువు మీదుగా క్రాస్ రోడ్డు వరకు రూ.4.50 కోట్లతో రోడ్డు వెడల్పు పనులను చేపట్టారు. పనులను సోమవారం మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఆర్‌అండ్‌బీ డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు.

చురుగ్గా పైపులైన్ల నిర్మాణం పనులు

వెంకటాపురం రహదారిని నాలుగులైన్ల రహదారిగా మారుస్తున్నందువల్ల పట్టణ శివారు నుంచి పేరంటాలమ్మ గుడి పంప్‌హౌస్ వరకు రెండు కిలోమీటర్ల మేర నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు చైర్మన్ రాజేష్ తెలిపారు. డబుల్ రోడ్డు పక్కన పాత పైపులైన్ ఉన్నందున ఫోర్ లైన్ ఏర్పాటుచేసి వాటి పక్కనే నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తామన్నారు.



పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజేష్, అధికారులు

విద్యార్థులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం శంకర్

సంజామల: జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జి.చిన్మయి, కె.కృతిలను సోమవారం పాఠశాల హెచ్‌ఎం శంకర్, పీఈటీ బాషా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇటీవల కర్నూలు జిల్లా గార్గేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 రోప్ స్కిప్పింగ్ పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి సెప్టెంబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపియ్యారన్నారు.

డోన్ టౌన్: ఈనెల 29, 30 తేదీల్లో కర్నూలు జిల్లా గార్గేయపురంలో జరిగిన రోప్ స్కిప్పింగ్ రాష్ట్ర స్థాయి అండర్ 17 పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు కృష్ణ సుమంత్, శరత్, మహేష్, హర్షవర్ధన్‌రెడ్డి ప్రతిభ కనబచి జాతీయ స్థాయికి ఎంపికై నట్లు శ్రీసుధ కరెస్పాండెంట్ వేణుగోపాల్ తెలిపారు. పాఠశాల్లో సోమవారం విద్యార్థులను అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె రూరల్: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె పట్టణం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న గౌరిగారి ఎర్రన్న(41) తన మొదటి భార్యను వదిలేసి, పదేళ్ల క్రితం ఆమె చెల్లెలు మల్లీశ్వరిని రెండో వివాహం చేసుకున్నారు. ఎర్రన్న మద్యం సేవిస్తూ జులాయిగా తిరిగేవాడు. కాగా తాగేందుకు డబ్బులు ఇవ్వడం లేదని భార్యతో ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలో ఆమె ఇదే కాలనీలో ఉన్న తన పుట్టింటికి రెండు రోజుల క్రితం వెళ్లింది. దీంతో మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవడంతో పాటు జీవితంపై విరక్తి చెందిన ఎర్రన్న ఆదివారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

వేగంగా అభివృద్ధి పనులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామం బోయపేట, ముస్లిం వీధిలో సీసీ రోడ్లు, మురుగు కాల్వ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. రూ.12 లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి తెలిపారు.



కొనసాగుతున్న మురుగు కాల్వ నిర్మాణ పనులు

భూసర్వే రాళ్లు సిద్ధం

కొలిమిగుండ్ల: జగనన్న భూహక్కు–భూరక్ష పథకం కింద రైతుల పొలాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేపట్టారు. మండలంలో 14 గ్రామాలను భూసర్వే కింద ఎంపిక చేశారు. బి.తాడిపత్రి, మీర్జాపురం, కొలిమిగుండ్ల గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయి. బి.తాడిపత్రిలోని రైతుల పొలాల్లో సర్వే పూర్తి కావడంతో ప్రభుత్వం 1,700 రాళ్లు మంజూరు చేసింది. భవిష్యత్‌లో రైతుల మధ్య భూవివాదాలు రాకుండా ప్రభుత్వమే సర్వే చేసి, హద్దులను గుర్తించి, రాళ్లు నాటి, హక్కు పత్రాలను అందజేస్తోంది.



బి.తాడిపత్రిలో సిద్ధంగా ఉంచిన సర్వే రాళ్లు